ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

ఆదివారం 2 నవంబరు 2025



కస్తూర్బాగాంధీ పాఠశాలలో వంటను పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

- మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. ప్రభుత్వం కల్పించిన డైట్ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. మహబూబాబాద్‌లో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ), ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకుని తరగతి గదులు, కిచెన్‌షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాశాఖ బలోపేతానికి నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యాబోధనలు అందించడం కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ తరగతి గదులు, తదితర సాధనాల ద్వారా ప్రతీ సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు, విద్యార్థి సామర్థ్యాలను వెలికితీయడం కోసం అనేక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని అందించాలని సూచించారు. నాణ్యమైన ఆహార పదార్థాలను వంటలకు ఉపయోగించాలని, వంట సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు వైద్యపరీక్షలు సిద్ధం చేసుకుని వారి మానసిక, ఆరోగ్యస్థితిగతులను గమనిస్తూ ఉండాలన్నారు. పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెరుగైన విద్య, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అన్ని వసతి గృహాల్లో వైద్య, విద్య, న్యూట్రిషన్, శానిటేషన్ పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

16న మానుకోట నుంచి టూర్ ప్యాకేజీ బస్



ఆర్టీసీ డిపో మేనేజర్ కల్యాణి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీలో భాగంగా ఈనెల 16న రాత్రి 11 గంటలకు మహబూబాబాద్ నుంచి పంచారామాలకు 40 సీట్ల డీలక్స్‌బస్ బయలు దేరనుందని స్థానిక డిపో మేనేజర్ వి.కల్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామాలు (అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట)కు చేరుకుని తిరిగి ఈనెల 18న మానుకోటకు చేరుకుంటుందని చెప్పారు. అందుకు గాను పెద్దలకు ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.1700, పిల్లలకు రూ.900 టికెట్ ధర నిర్ణయించామని చెప్పారు. టికెట్ బుకింగ్ కోసం ఎంఆర్.రెడ్డి సెల్: 73962 10102 , ఎమ్డీ. నబి 99482 14022కు ఫోన్ పే చేసి సీటు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకుని పంచారామాల పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని కోరారు.

సీఎం సీరియస్...



కన్నీటి ఓరుగల్లు



అక్టోబరు 29న మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో నగరాన్ని ముంచెత్తిన వరద నీరు (ఫైల్)

ఇప్పటికైనా కదిలేనా!?

ప్రతీ ఏటా వర్షాకాలంలో చారిత్రక వరంగల్ నగరం వరదల బారిన పడి అల్లాడుతోంది. చిన్నపాటి వానలకే అనేక చోట్ల వరద పోటెత్తుతోంది. ప్రధాన రహదారులు గోదారులుగా మారుతున్నాయి. కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటుండటంతో జనం చెప్పలేని కష్టాలకు గురవుతున్నారు. గత కొన్నేళ్లుగా నగరంలో చెరువులు, నాలాలు యథేచ్ఛగా కబ్జాల బారిన పడుతుండటమే ఇందుకు కారణం. మురికి కాలువ పక్కన ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. కబ్జారాయుళ్లు దర్జాగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు ప్రశ్నిస్తే, చేతులు తడిపి మేనేజ్ చేసుకుంటున్నారు. కబ్జాల వల్ల నగరంలోని 170 చెరువుల్లో సగం మాయమయ్యాయి. నగర పరిధిలో 16.42 కి.మీ. పొడవున్న నాలుగు ప్రధాన నాలాలను ఇరువైపులా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేశారు. దీంతో చిన్నపాటి వానకు కూడా నగరంలో జల విలయం సంభవిస్తోంది. ఇటీవలి మొంథా తుపాను వల్ల వరంగల్ నగరం జల కల్లోలం బారిన పడిన నేపథ్యంలో.. గత శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా నాలాలు, చెరువుల అక్రమణలను ఉపేక్షించవద్దని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఇప్పటికైనా అధికారుల్లో కదలిక వచ్చేనా..? అక్రమణలు తొలగేనా..? అనే చర్చ సాగుతోంది.

ఓరుగల్లులో చెరువులు, నాలాల కబ్జాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలన్న సీఎం

- నగరంలో 170కి పైగా చెరువులు, కుంటల్లో సగం మాయం
- భద్రకాళి, బంధం, కోట, చిన్నవడ్డెపల్లి చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో 1,094 అక్రమ కట్టడాల గుర్తింపు
- మురికి కాలువలను సైతం వదలని అక్రమార్కులు.. 524కు పైగా అక్రమ నిర్మాణాలు
- నాలా స్థలాల్లో విద్య, వైద్య సంస్థలు, షాపింగ్‌మాల్స్, ఫంక్షన్‌హాల్స్, షాపులు
- చెరువులు, నాలాల ఆక్రమణలతో కాలనీల్లోకి వరదనీరు
- ఆక్రమణలపై ఉపేక్షించవద్దన్న ముఖ్యమంత్రి
- సీఎం ఆదేశాలతో అధికారుల్లో చలనంపై ఆశలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణకు రెండో రాజధానిగా చెప్పుకుంటున్న వరంగల్ మహానగరంలో ఖాళీ జాగా కనిపిస్తే కబ్జాలు జరుగుతున్నాయి. గ్రేటర్ పరిధిలో 170 చెరువులు, కుంటలు ఉన్నట్లుగా ఇటీవల అధికారులు గుర్తించారు. వీటిలో 80కి పైగా కుంటలు, చెరువులు వాటి స్వరూపాన్ని కోల్పోయాయి. మిగిలిన వాటిల్లో నగరం నడిబొడ్డున ఉన్న నాలుగు ప్రధాన జలాశయాల్లో ఒకటైన భద్రకాళి చెరువు 495.89 ఎకరాల్లో విస్తరించింది. 180 ఎకరాలకుపైగా చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైందని అంచనా. చెరువు చుట్టూ 249 అక్రమ కట్టడాలను నిర్మించారు. వీటిలో 108 అక్రమ కట్టడాలను ఇటీవల కూల్చివేయగా, మిగతా నిర్మాణాలపై చర్యలకు రాజకీయ ఒత్తిళ్ల (మిగతా 7వ పేజీలో)

రహదారా.. గోదారా..



గోపాల్‌పూర్ కాలనీలో ప్రజలను పడవపై సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్ రఫీ

శాంతియుత జీవనం గడపాలి

జిల్లా జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కుటుంబం, సమాజంలో తలెత్తే వివాదాలను సామాజిక మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుని.. శాంతియుత జీవనం గడపాలని జిల్లా జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మహబూబాబాద్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మునిసిపాలిటీ సంబంధిత భవనంలో ఏర్పాటు చేసిన సకల జనుల కమ్యూనిటీ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కమ్యూనిటీ సామాజిక మధ్యవర్తులచే నిర్వహించబడే ఈ సెంటర్‌లో వివిధ సామాజిక వర్గాలకు చెందిన వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. నేటి సమాజంలోభార్యాభర్తల మధ్య చిన్నపాటి తగవులకే ఎన్నో కేసులు దాఖలు అవుతున్నాయని, దానివల్ల సున్నితమైన బంధాలు దెబ్బతింటున్నాయన్నారు. ఇటువంటి వాటిని నివారించి సత్సంబంధాలు నెలకొల్పటంలో సామాజిక మధ్యవర్తిత్వ కేంద్రాలు ముఖ్యపాత్ర వహించాలని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శాలిని షాకెల్లి మాట్లాడుతూ కమ్యూనిటీ వివాదాలను పరిష్కరించడంలో శిక్షణ పొందిన వలంటీర్లు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్, శంతన్ రామరాజు, పిట్టల బుచ్చిరామారావు, సుతారపు వెంకటనారాయణ, ఎడ్ల శ్రీనివాస్, వాంకుడోతు భద్రమ్మ పాల్గొన్నారు.

కొత్త పంథా..

- సెర్ప్ నుంచి మెప్మాలోకి.. మహిళా సంఘాలు
- కేసముద్రంలో 485 గ్రూపులు, 5,038 మంది సభ్యులు
- ఐకేపీ లోంచి.. మునిసిపాలిటీకి మార్పు
- పట్టణ తరహాలో నైపుణ్య, వ్యాపార, సేవా రంగాల్లో శిక్షణ
- పేదరిక నిర్మూలన దిశగా నూతన కార్యక్రమాలు



కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలో సమావేశమైన స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు

కేసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనతో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు రూపొందించిన స్వయం సహాయక సంఘాలు కేసముద్రంలో కొత్త పంథాలోకి మారబోతున్నాయి. ఈ ఏడాది జనవరి 25న కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజి, అమినాపురం, ధన్నసరి, ఎస్టీకాలనీ (సబ్‌స్టేషన్‌తండా) గ్రామపంచాయతీల విలీనంతో కేసముద్రం మునిసిపాలిటీ ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో మునిసిపాలిటీ పరిధిలోని పూర్వ గ్రామాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్)లో కొనసాగిన మహిళా స్వయం సహాయ సంఘా (ఎస్‌హెచ్‌జీ)లన్నీ ఇక నుంచి మునిసిపాలిటీ పరిధిలోకి మారనున్నాయి. మునిసిపాలిటీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఈ స్వయం సహాయక సంఘాలను నిర్వహించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో మాదిరిగా కాకుండా పట్టణ తరహాలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు సమావేశాలు నిర్వహించడం, పొదుపు, బ్యాంకు లింకేజీలు, స్వయం ఉపాధి, సేవారంగం, నైపుణ్య శిక్షణ, ఆర్థిక సహాయం అందిస్తూ పట్టణ పేదరిక నిర్మూలన దిశగా నూతన కార్యక్రమాలు కొనసాగనున్నాయి.


మెప్మాలో సంఘాల తీరు ఇలా..

మెప్మా ఆధ్వర్యంలో మునిసిపాలిటీ పరిధిలో కొనసాగే స్వయం సహాయక సంఘాలు (గ్రూపులు) యధాతథంగా ఉంటాయి. అలాగే గ్రామైక్య సంఘాల మాదిరిగా వార్డు పరిధిలోని 15 నుంచి 20 సంఘాలను కలిపి స్లమ్‌స్థాయి సమాఖ్య (ఎస్‌ఎల్‌ఎఫ్)లను ఏర్పాటు చేస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని అన్ని ఎస్‌ఎల్‌ఎఫ్‌లు కలిపి ఒక పట్టణ స్థాయి సమాఖ్య (టీఎల్‌ఎఫ్)ను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని స్థాయిల్లోని సంఘాలకు అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారులను ఎన్నుకుంటారు. ఎస్‌ఎల్‌ఎఫ్‌లకు వీవోఏల స్థానంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో)/రిసోర్స్ పర్సన్(ఆర్‌పీ)లు ఉంటూ మహిళలకు మార్గదర్శకం చేస్తుంటారు. ఈ సంఘాలు, ఆర్‌పీల పనితీరును పట్టణ స్థాయిలో టౌన్ మిషన్ కోఆర్డినేటర్ (టీఎంసీ) పర్యవేక్షిస్తారు. అలాగే వీరిపైన పర్యవేక్షకులుగా జిల్లాస్థాయిలో డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్(డీఎంసీ), రాష్ట్రస్థాయిలో స్టేట్ మిషన్ డైరెక్టర్ (ఎస్‌ఎండీ) ఉంటారు.

మునిసిపాలిటీలో 5,038 మంది సభ్యులు...

నూతనంగా ఏర్పాటైన కేసముద్రం మునిసిపాలిటీలో విలీన గ్రామాల పరిధిలో 485 స్వయం సహాయక సంఘాల్లో 5,038 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరిలో కేసముద్రం స్టేషన్‌లో గ్రామైక్య సంఘాలైన అంబేద్కర్, భాగ్యలక్ష్మి, గాయత్రి, స్ఫూర్తి, ప్రతిభ ఉండగా ఇందులో 188 స్వయం సహాయ సంఘాలు 1,946 మంది సభ్యులున్నారు. కేసముద్రం విలేజిలో దుర్గాభవాని, జీవనజ్యోతి, మహిళ, శాంతి, స్నేహాంజలి సంఘాల్లో 147 గ్రూపుల్లో 1,510 మంది సభ్యులు ఉన్నారు. అమినాపురంలో మహిళా క్రాంతి, రాజరాజేశ్వరి సంఘాల్లోని 55 గ్రూపుల్లో 597 మంది సభ్యులు, ధన్నసరిలో చామంతి, శ్రీచైతన్య సంఘాల్లో 64 గ్రూపుల్లో, 669 మంది సభ్యులు, సబ్‌స్టేషన్ తండాలో శ్రీసాయి గ్రామైక్య సంఘంలో 31 గ్రూపుల్లో 316 మంది సభ్యులున్నారు. వీరందరినీ మెప్మాలోకి ఆన్‌లైన్ చేసే కార్యక్రమం కొనసాగుతోంది. ఈ మహిళా సంఘాలన్నింటికి పట్టణాల తరహాలో మెప్మా పరిధిలో మహిళలకు వృత్తి నైపుణ్యం, వ్యాపారం, సేవ, ఉపాధి రంగాలపై దృష్టి పెట్టి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు.

పట్టణ తరహాలో ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు



మెప్మాతో పట్టణ తరహాలతో ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించే అవకాశం ఏర్పడుతుంది. చిన్నతరహా, కుటీర పరిశ్రమల ఏర్పాటు కోసం మహిళలకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు శిక్షణనిచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

\- గార్లపాటి అనిత, కేసముద్రం టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు



రిలే దీక్షకు మద్దతు తెలుపుతున్న హరిప్రియనాయక్

'రాష్ట్రంలో అరాచక పాలన'

కాంగ్రెస్ నేత దీక్షకు మాజీ ఎమ్మెల్యే మద్దతు 6

ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ కలహాలు...

- మానసిక వేదనతో ఎస్‌బి ఎస్సై హఫీసుద్దీన్ ఆత్మహత్య
- మరో నాలుగు నెలల్లో రిటైర్‌మెంట్ ఉండగానే తీవ్ర నిర్ణయం



హఫీసుద్దీన్ (ఫైల్)

నర్సంపేట టౌన్/చెన్నారావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఎస్.బి. ఎస్సై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వరంగల్ జిల్లాలోని నర్సంపేట పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. నర్సంపేట ఎస్సై అరుణ్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. నర్సంపేట పట్టణంలోని వల్లభ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎమ్డీ. హఫీసుద్దీన్(60) స్పెషల్ బ్రాంచి ఎస్సైగా ఖానాపురం, చెన్నారావుపేట మండలాల్లో గత మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు, ఆర్థికపరమైన ఇబ్బందులతో కొంతకాలంగా ఆయన మానసికంగా కలత చెందుతున్నారు. ఈ సమస్యకు కుటుంబ కలహాలు తోడయ్యాయి. శుక్రవారం ఆయన యథావిధిగా విధులకు హాజరయ్యారు. డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత రాత్రి సమయంలో గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య నూర్జహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. హఫీసుద్దీన్ ఆత్మహత్యతో పోలీసు వర్గాల్లో విషాదం నెలకొంది. వరంగల్ రంగశాయిపేటకు చెందిన హఫీసుద్దీన్ 1984లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. అనంతరం ఎస్సైగా పదోన్నతి పొందారు. 2026 ఫిబ్రవరిలో ఆయన రిటైర్ కావాల్సి ఉంది.



వ్యవసాయ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

ఏ రైతుకూ అన్యాయం జరగవద్దు

- పంట నష్టంపై అంచనా వేయాలి 8
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

తగ్గిన పాలేరు ఉధృతి

సూర్యాపేటకు రాకపోకలు కొనసాగింపు

దంతాలపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట - దంతాలపల్లి మీదుగా ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు తిరిగి కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారు జామున నుంచే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను పెద్దముప్పారం మీదుగా వెళ్లుతున్నాయి. గత మూడు రోజులుగా పాలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మండల ప్రజలు, ఇతర ప్రయాణికులు కుమ్మరికుంట్ల మీదుగా సూర్యాపేటకు వెళ్లారు. స్థానిక ఎస్సై పిల్లల రాజు ఆధ్వర్యంలో పాలేరు వాగు వద్ద సూచన బోర్డుతో పాటు వాగు వద్ద ఏర్పాటు చేసిన భారీ బారికెడ్లను పోలీసులు తొలగించారు.

నష్టం అంచనాలను పంపించాలి

అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

తొర్రూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌తో జరిగిన నష్టం అంచనాలను అధికారులు త్వరితగతిన అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులను ఆదేశించారు. శనివారం తొర్రూరు మండలంలో కొమ్మనపల్లి తండా, బొత్తలతండా వద్ద ధ్వంసమైన కల్వర్టులను పరిశీలించి మాట్లాడారు. అనంతరం గుర్తూర్‌లో నీట మునిగిన పంటలతో పాటు, ఇళ్లలోకి నీరు చేరడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గుర్తూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీకి సమీపంలో ఉన్న మిరపకుంట నుంచి నీటి ఉధృతితో ఇళ్లలోకి నీరు వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే సంబంధిత అధికారులు మిరపకుంట నుంచి నీరు సాఫీగా వెళ్లడానికి కెనాల్‌ను వెడల్పు చేసే విధంగా ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో రాంనర్సయ్య, ఎంపీవో పూర్ణచందర్, ఏఈ నరేశ్‌రెడ్డి, ఆర్.ఐ నిజాముద్దీన్, పంచాయతీ కార్యదర్శులు లెనిన్, శ్రావణి, అమజ్జద్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన కల్వర్టును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

తొర్రూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు ఎమ్డీ.అమీర్ అన్నారు. సోమవారం తొర్రూరులో స్కాలర్ షిప్ విడుదల చేయాలని కోరుతూ భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తైనా పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, యశ్వంత్, రాకేష్, అభినయ్ తదితరులు ఉన్నారు.

నేడు అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

తొర్రూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణంలో కొలువై ఉన్న హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు నవంబర్ 2వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. తెల్లవారుజాము నుంచే గణపతి హోమం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, కలశపూజ, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు దారం ప్రసాద్ తెలిపారు.

వాహనం బోల్తా .. ఒకరి మృతి

నలుగురికి స్వల్ప గాయాలు



బోల్తా పడిన వాహనం, పవన్ మృతదేహం

మరిపెడ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అతి వేగం కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఓ శుభకార్యంలో క్యాటరింగ్ చేసేందుకు శనివారం ఉదయాన్నే బొలెరో వాహనంలో 25 మంది యువకులు వెళ్తుండగా అతి వేగంతో అదుపు తప్పడంతో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బుర్హాన్‌పురం శివారులో జాతీయ రహదారి 365పై చోటు చేసుకుంది. గాయపడిన వారిని 108లో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులు, మరిపెడ పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం.. సీరోలు మండలంలోని ఉప్పరిగూడెం, మరిపెడ మండలంలోని లచ్చా తండాకు చెందిన 25 మంది యువకులు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ శుభకార్యంలో క్యాటరింగ్ చేసేందుకు బొలెరో వాహనంలో బయలుదేరి వెళ్తుండగా మార్గమధ్యంలోనే బుర్హాన్‌పురం శివారులో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మాలోతు పవన్ నాయక్(20) మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో నలుగురికి మాలోతు సందీప్, బానోతు ఈశ్వర్, గుగులోతు కుమార్, లచ్యా తండాకు చెందిన లక్ష్మణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి తండ్రి దివ్యాంగుడు కాగా, కుటుంబ పోషణ కొరకు పవన్ వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడని, శనివారం మిత్రులతో కలిసి క్యాటరింగ్‌కు వెళ్తుండగా ఘటన చోటుచేసుకుందని మృతుడి బంధువులు తెలిపారు.

కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

పెద్దవంగర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత వృత్తిపై ఆధాపడి జీవిస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు గునిగంటి మోహన్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అవుతాపురం గ్రామంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులతో మూడవ మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదం అని తెలిసి ప్రాణాలు తెగించి గీత వృత్తి కొనసాగిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం మూడవ మహా సభలను అన్ని గ్రామాల నుంచి గౌడ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు అనపురం చంద్రమౌళిగౌడ్, ప్రధాన కార్యదర్శి కొయ్యడి యాకయ్యగౌడ్, బొమ్మెర శ్రీనుగౌడ్, బిచ్చాలు, యాకయ్య, గురువయ్య, సోమమల్లుగౌడ్, లచ్చయ్యగౌడ్, ఎరుకలి సమయ్యగౌడ్, సోమన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కల్లు గీత కార్మికులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

దంతాలపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈఈ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు చేస్తుండడంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ నాయకుడు బాబు మృతి

గార్ల నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అంజనాపురంలో అనారోగ్యంతో బాధపడుతూ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిలక బాబు (60) శనివారం మృతి చెందాడు, గతంలో పోలీస్‌శాఖలో ఉద్యోగంలో చేరి, అవార్డును అందుకున్నారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి, రాజకీయ ప్రవేశం చేశారు. ఈ క్రమంలో బాబు తన భార్యను ఎంపిటీసీగా గెలిపించి, ఎంపీపీ పదవి పొందాడు. ఐదేళ్లుగా రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకున్న బాబు మరణవార్త తెలియగానే.. కాంగ్రెస్ మండల అధ్యక్షడు ధనియాకుల రామారావు, ఎంఎ. జలీల్, భీముడునాయక్, మాజీ సర్పంచ్ రాంజీనాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

● మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ ● కాంగ్రెస్ నేత దీక్షకు మద్దతు

బయ్యారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందనటానికి బయ్యారంలో ఇటీవల జరిగిన ఉదంతమే నిదర్శనమని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆరు రోజులుగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు శనివారం మద్దతు తెలిపారు. తనపై జరిగిన దాడికి సంబంధించిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీనివాస్‌రెడ్డి దీక్ష చేపడుతున్న సంగతి తెలిసింది. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత పార్టీ నేతలపైనే దాడులు జరుగుతుంటే ఇక సామాన్యుల పరిస్థితేంటని ప్రశ్నించారు. కట్టడి చేయాల్సిన పోలీసులే ప్రేక్షపాత్ర వహించడం విచారకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ తీరు సరికాదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్, సత్యనారాయణ, లక్ష్మణ్‌నాయక్, జగన్, శ్రీను, వీరన్న, ఉదయ్, వెంకన్న పాల్గొన్నారు. కాగా చల్లా గోవర్ధన్ అనే వ్యక్తి మద్దతుగా దీక్షలో కూర్చున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి

తొర్రూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న 280 డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని కోరుతూ గత ఆరు నెలలుగా సీపీఎం, అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చేస్తున్నా ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి ఎమ్డీ.యాకూబ్ అన్నారు. శనివారం డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిరసన తెలుపుతున్న అర్హులైన లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. ఇళ్లులేని నిరుపేద మహిళలు నిరసన తెలుపుతుంటే స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. మహిళల అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానని తెలిపి ఇచ్చిన హామీని మరిచారని విమర్శించారు. వెంటనే అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. దర్గయ్య, శ్రీను, అమీర్, శోభ, వరలక్ష్మి, భవాని, బాబుగౌడ్, షమీన, అమీన, అరుణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లాలి

మరిపెడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లాలని ఎంఈవో అనితాదేవి అన్నారు. శనివారం ఆమె మరిపెడ హై స్కూళ్లో చెక్‌ముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నవంబరు 7న పాఠశాలల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబరు 12 నుంచి 14వ తేది వరకు రాష్ట్ర స్థాయి చెక్‌ముకి టాలెంట్ టెస్ట్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మరిపెడ మండల బాధ్యులు బయ్యగాని రాంమోహన్, కార్యదర్శి నవీన్ కుమార్, కన్వీనర్ సుభాన్, శ్రీశైలం, నెహ్రూ, ప్రకాశ్, శౌరి, రమేశ్‌రెడ్డి, లెనిన్, ప్రసాద్ రావు, సారయ్య, సురేశ్, బాబురావు, అనిత, సుధ, మంజుశ్రీ, యాదగిరి, శంకర్ పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

పెద్దవంగర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన చిలువేరు ప్రమోద్‌కుమార్‌ను బీఆర్ఎస్ నాయకులు శనివారం మార్యదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా గ్రామాల్లో పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ ప్రజల మన్నలను పొందాలన్నారు. శాంతిభద్రలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సైని కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, కనుకుంట్ల వెంకన్న, వేముల రఘు, గుగులోతు పటేల్ నాయక్, వెంకట్‌రెడ్డి, వెంకన్న, శంకర్, అనపురం రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్ పంపిణీ

మరిపెడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మోడల్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులకు నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ సంస్థ ప్రతినిధులు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ హెచ్ఎం మొహమ్మద్ అక్తర్ జమాన్ ఆ సంస్థ ప్రతినిధులను అభినందించారు. విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాల సాధనలో కెరీర్ గైడెన్స్ కోసం ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ వాట్సాప్ నంబరు 7892782387ను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆ సంస్థ ఫౌండర్, శాస్త్రవేత్త మోహన్ జయకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ స్కూల్ అధ్యాపకులు జానకి రాములు, మణిత, నాగరాజు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

మరిపెడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ బంగ్లాలోని రాములోరి గుడిలో శనివారం జరిగిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రత పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు సతీసమేతంగా పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఆ ఆలయ అర్చకుడు సుదర్శన్ భట్టార్ సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆ ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

పెద్దవంగర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యూడైజ్ ప్లస్‌లో విద్యార్థుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో మండల స్థాయి యూడైజ్ ప్లస్ 2025-2026పై అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధాయ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కళాధర్, శేషవల్లి, స్ట్రాంగ్ టీచర్ సత్యానారాయణ, సీఆర్పీ సంతోష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

గంగారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న బాధిత రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకులు జోగా రాములు డిమాండ్ చేశారు. శనివారం పందెం గ్రామంలో నేలవాలి దెబ్బతిన్న వరిపంటను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. మండలంలో వందలాది ఎకరాలలో వరి, పత్తి పంట వేలాది ఎకరాలలో మొక్కజొన్న పంట నేలవాలి నష్టం జరిగిందని అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనాలు వేసి, తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోక పోతే ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో పూనెం రవి, లక్ష్మణరావు, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సై సాయికుమార్‌కు సన్మానం

గార్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్సై సాయి కుమార్‌ను శనివారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఆపద సమయంలో పోలీస్‌స్టేషన్ వచ్చే పేదలకు తనవంత సహాయం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి, లక్ష్మి, సుజాత, రమాదేవి, మౌనిక, పాల్గొన్నారు.

లక్ష్యాలను ఎంచుకొని చదువుకోవాలి

తొర్రూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకొని చదువుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సూర్నం రామనర్సయ్య అన్నారు. ఫ్రోప్ పాస్ట్ మల్టీపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ వంగాల గోపాల్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం మండలంలోని గుర్తూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ప్యాడ్లు పంపిణీ చేసి మాట్లాడుతూ నిరుపేదల అభివృద్ధి కోసం లయన్స్ సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ దామెర సరేష్, పీఆర్వో తమ్మెర విశ్వేశ్వరరావు, సతీష్ రెడ్డి, క్లబ్ సెక్రెటరీ ముడుపు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బయ్యారం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో రోజురోజుకు పెచ్చుమీరుతున్న సైబర్ నేరాల ఉచ్చులో పడకుండా తమను తాము రక్షించుకునేలా అప్రమత్తంగా ఉండాలని ప్రొహిబిషన్ ఎస్సై మహబూబీ విద్యార్థులకు సూచించారు. బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోక్సో, సైబర్ నేరాలు, యాంటీ ర్యాగింగ్, వేధింపులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రిన్సిపాల్ రాజమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంతోష్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలి

కొత్తగూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన అమరవీరుల సంస్మరణ సభలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని ఎన్డీ మండల కార్యదర్శి భూర్క బుచ్చిరాములు పిలుపునిచ్చారు. గోవిందాపురంలో శనివారం నిర్వహించిన సమావేశంలో అమరవీరుల సంస్మరణ సభల వాల్‌పోస్టర్లను ఎన్డీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 7న కొత్తగూడలో నిర్వహించతలపెట్టిన పాలడుగు కృష్ణ సంస్మరణ సభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్డీ నాయకులు పుల్లన్న, శ్రీశైలం, జక్కుల సమ్మయ్య, చెవ్వ రాజు, బోనగిరి సారయ్య, పిట్టల దేవేందర్, రాసమల్ల శ్రీను, చెవ్వ ఉపేందర్, శ్రీను, వీరారెడ్డి పాల్గొన్నారు.

● గార్ల : అమరుల పోరాట స్ఫూర్తితోనే నేటితరం కార్యకర్తలు ప్రజా ఉద్యమాలను నిర్మించాలని న్యూడెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి.సక్రు పిలుపునిచ్చారు. ఈ నెల 1వ తేదీ నుంచి 9 వరకు జరుగనున్న అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సత్యనారాయణపురం, ముల్కనూరు, చిన్నకిష్టాపురం, పెద్దకృష్టాపురం, పోచారం, గార్ల, గోపాలపురం గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేశారు.



మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యూ డెమోక్రసీ కార్యకర్తలు

అనంతరం పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్డీ నాయకులు ఎం.వీరభద్రం, సీహెచ్.గణేష్, ఇర్రి రవి, మాన్యనాయక్, గౌని భద్రయ్య, ఎర్రగడ్డ కొండల్‌రావు, చింతల గురవయ్య పాల్గొన్నారు.

● బయ్యారం : పేద ప్రజల విముక్తి కోసం పోరాడి అసువులు బాసిన అమరుల ఆశయ సాధన కోసం యువత ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్)-న్యూడెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు కోరారు. ఈ నెల 7వ వరకు జరిగే అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం బయ్యారం, ఇర్సులాపురం గ్రామాల్లోని అమరుల స్థూపాల వద్ద జెండాలు ఆవిష్కరించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో సీపీఐ (ఎంఎల్)-న్యూ డెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు వెంకటేశ్వర్లు, జగ్గన్న, సూర్యం, సత్యం, పద్మ, బిక్షం, వీరభద్రం యాకయ్య, వెంకన్న, రాకేష్, భగవాన్, అశోక్, లింగమల్లు, లచ్చయ్య, పూర్ణ, తిరుమలేష్, యాకూబ్ పాష పాల్గొన్నారు.

భళా లోకేష్

» పారా అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్న యువకుడు
» రాష్ట్ర, జాతీయ స్థాయిలో 16 బంగారు, 6 రజత, 3 కాంస్య పతకాలు కైవసం
» దివ్యాంగుడైనప్పటికీ బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి
» కోచ్ వేణు శిక్షణలో పరిమళిస్తున్న ప్రతిభ
» పారా యూత్ ఏషియన్ గేమ్స్‌కు ఎంపిక





13వ నేషనల్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం అందుకుంటున్న లోకేష్ (ఫైల్)

ఖానాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అతడు పుట్టుకతోనే దివ్యాంగుడు... కానీ తనలోని లోపాన్ని చూసి అధైర్యపడలేదు. చిన్ననాటి నుండే క్రీడల పట్ల మక్కువ పెంచుకున్నాడు. ఆటలపై ఇష్టం అతడిని పాఠశాల స్థాయిలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేలా చేసింది. పాఠశాల స్థాయిలో కబడ్డీతో మొదలైన అతడి ప్రస్థానం అథ్లెటిక్స్ తైక్వాండో పోటీలలో దేశానికి ప్రాతినిధ్యం వహించేస్థాయికి ఎదిగాడు. డిసెంబర్‌లో దుబాయ్‌లో



తల్లిదండ్రులతో లోకేష్

జరగబోయే పారా యూత్ ఏషియన్ గేమ్స్‌కి ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. అతడే. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన పారా అథ్లెట్ ఆకుల లోకేష్.

నేపథ్యం..

ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన ఆకుల ఉప్పలయ్య -మంజుల దంపతుల చిన్నకుమారుడు లోకేష్ పుట్టుకతోనే దివ్యాంగుడు. అతడికి ఎడమచేయి లోపం ఉంది. చిన్ననాటి నుంచి అతడికి ఆటలంటే ఎంతో మక్కువ. 7వ తరగతి చదువుతున్నప్పుడు పాఠశాల స్థాయి పోటీలలో పాల్గొని షాట్‌పుట్‌లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి పొందాడు. 2016లో పాఠశాల స్థాయి కబడ్డీ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికై బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున ఆడాడు. 2017లో పాఠశాల స్థాయిలో హైద్రాబాద్‌లో జరిగిన స్టేట్‌మీట్ అథ్లెటిక్స్‌లో పోటీలలో పాల్గొని షాట్‌పుట్, రన్నింగ్ (200 మీటర్ల విభాగంలో)పోటీలలో బంగారు పతకాలు గెలుచుకున్నాడు. వీటితో పాటుప్రతి ఏటా ఖేలో ఇండియా పోటీలలో పాల్గొని ప్రతిభ చూపి పతకాలు సాధించాడు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో..

లోకేష్ 2021లో భువనేశ్వర్‌లో జరిగిన నేషనల్ పారా అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నాడు. ప్రతిభ ఉన్నప్పటికీ సరైన శిక్షణ లేకపోవడంతో రాణించలేకపోయాడు . అక్కడే లోకేష్‌లోని ప్రతిభను గుర్తించిన పారా అథ్లెట్ కోచ్ వేణు హైదరాబాద్ స్పోర్ట్స్ హాస్టల్‌లో సదుపాయం కల్పించాడు. కఠిన శిక్షణ ఇచ్చి గొప్పగా తీర్చిదిద్దాడు . ఈ క్రమంలో 2021లో గుజరాత్‌లో జరిగిన 12వ నేషనల్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్ పోటీలలో లోకేష్ పాల్గొని షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించాడు. వెంటనే లోకేష్‌కు ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీలో చోటు కల్పించారు. 2024 జూలైలో బెంగుళూరులో జరిగిన 13వ నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అండర్ (19)విభాగంలో షాట్‌పుట్, డిస్కస్ త్రోలో బంగారు పతకాలు, జావెలిన్ త్రోలో వెండి పతకం సాధించి ఔరా అనిపించాడు. లోకేష్ దేహదారుడ్యం బలంగా ఉండడంతో కోచ్ వేణు అథ్లెటిక్స్‌తో పాటు తైక్వాండో పోటీలకు శిక్షణ ఇచ్చారు. దీంతో సెప్టెంబర్‌లో పంజాబ్‌లో జరిగిన పారా యూత్ ఏషియన్ గేమ్స్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచి డిసెంబర్‌లో దుబాయ్‌లో జరుగబోయే పారా యూత్ ఏషియన్ గేమ్స్‌కి ఎంపికయ్యాడు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో 16 బంగారు పతకాలు,6 రజత పతకాలు,3 కాంస్య పతకాలు సాధించాడు.

పారా ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

- అవుల లోకేష్, పారా అథ్లెట్

పారా ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం సాధించడమే నా జీవిత లక్ష్యం. ముందుగా యూత్ ఏషియన్ గేమ్స్‌లో పతకం సాధించడానికి కష్టపడుతున్నా. కోచ్ వేణు పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నాను. తప్పక పతకం సాధిస్తానన్న నమ్మకం ఉంది. పోటీలకు వెళ్లడానికి నా ఆర్థిక పరిస్థితి సరిపోవడం లేదు. దాతలు, ప్రభుత్వం స్పందించి దుబాయి వెళ్లడానికి సహకరించాలి.



కొంకపాకలో పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తదితరులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

» ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే మంజూరు చేయాలి
» మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
» మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్

పర్వతగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొంకపాక గ్రామంలో పంట నష్టపోయిన క్షేత్రాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల భారీ తుఫాన్‌తో లక్షలాది ఎకరాల్లో పంటల నష్టం జరిగి రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి ఎకరాకు రూ.30 వేలు, ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు మంజూరి చేయాలని, చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన తుఫాన్ బారిన పడిన పంటల వివరాలు సేకరించాలన్నారు. తాత్కాలికంగా రూ.20 వేలు, 50 కిలోల బియ్యం, బెట్ షీట్లు, చెద్దర్లు, బట్టలు ఇవ్వాలని కోరారు. పశువులు కోల్పోయిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. అనంతరం రావూరు గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ దొమ్మటి లక్ష్మీ నారాయణ బైక్ ప్రమాదంలో గాయాలపాలు కాగా, ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్, చింతపట్ల సోమేశ్వర్ రావు, మాడుగుల రాజు, చిన్నపాక శ్రీనివాస్, రంగు కుమార్, మోహన్ రావు, మేరుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో క్రీడా సందడి

ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 ఎంపిక పోటీల షురూ



జిమ్నాస్టిక్స్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో కఠోర సాధన, పట్టుదలతో శ్రమించడం ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు చేరుకోవచ్చని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-14, 17 ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్ లోని జిమ్నాస్టిక్స్ హాల్లో శనివారం ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి అండర్-14, 17బాలబాలికల జిమ్నాస్టిక్స్, జూడో క్రీడా పోటీలను అడిషనల్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు అవసరమన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎదగాలంటే జిల్లా స్థాయి నుంచే ఆటల్లో ప్రావీణ్యం పెంచుకోవాలని సూచించారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడాకారులు తమ ప్రతిభతో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించి జిల్లాకు కీర్తి, ప్రతిష్టలు తీసుకరావాలని ఆకాక్షించారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి అండర్-14, 17బాలబాలికల జిమ్నాస్టిక్స్, జూడో క్రీడాంశాల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఈ క్రీడా పోటీలు 3రోజుల పాటు కొనసాగుతాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో త్వరలో నిర్వ హించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు (టీజీపేట) శీలం పార్థసారథి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసి యేషన్ (ఎస్‌పీఈటీఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ప్రభాక ర్‌రెడ్డి, డి.కుమార్, కన్వీనర్లు సీహెచ్. పెద్దిరాజు, ఎం.సురేష్‌బా బు, వి.రాణి, ఎస్.శ్రీలత, జూడో అబ్జర్వర్ సత్యనారాయణ, కోచ్‌లు నీలం సురేష్, సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్.సుభాష్, జి. రవీంద్రప్రసాద్, రెఫరీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి, రోడ్డును పునఃనిర్మించాలి

» స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి » ధ్వంసమైన పంటలు, రహదారుల పరిశీలన » ఇరిగేషన్ అధికారులపై రైతుల ఆగ్రహం

కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి



ధర్మసాగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో కొట్టుకుపోయిన బ్రిడ్జి, రోడ్డును త్వరితగతిన పూర్తిచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. ధర్మసాగర్ మండలంలో దేవునూర్ గ్రామంలో తుఫాన్ వల్ల నష్టపోయిన వరి పంటలను, ధ్వంసమైన బ్రిడ్జి, రోడును శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. దేవునూర్ బ్రిడ్జి నుంచి రాపాకపల్లి గ్రామానికి వెళ్లే బ్రిడ్జి వరకు కాలినడకన వెళ్లి నష్టపోయిన పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారుల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోయామని రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన తమ పంటలు నీటిలో మునిగి నష్టపోయామని దేవునూర్ గ్రామానికి చెందిన రైతులు నార్లగిరి సమ్మయ్య, చిట్టె రవి పురుగుల ముందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని పురుగుల మందు డొబ్బాలను లాక్కుని సర్దిచెప్పడంతో రైతులు శాంతించారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన మరో రైతు మోరే మహేందర్ సాగు చేసిన మూడు ఎకరాల వరి పంట పూర్తిగా నష్టం వాటిళ్లడంతో మన స్తాపం చెంది పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా వారించారు.

అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. వర్షం వల్ల నష్టం జరిగితే రైతుల అదృష్టం బాగాలేదని అనుకుంటాం.. కానీ, దేవాదుల ప్రాజెక్ట్ కాలువ గేట్ల వరద వల్ల రైతుల పంటలు మునిగిపోతే పరిహారం ఎవరు చెల్లించాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. దేవునూర్ బ్రిడ్జి మరమ్మతు, రోడ్డు పనులను 15 రోజుల్లో పూర్తిచేసి నిలిచిపోయిన రాకపోకలను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. దేవునూర్ బ్రిడ్జి, రోడ్డు తాత్కాలిక మరమ్మతు పనుల కోసం సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసి త్వరితగతిన పనులను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వపరంగా మంజూరు చేసిన నిధులు సరిపోకుంటే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఈజీఎస్ నిధులు మంజూరు చేయిస్తామని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. వరద వల్ల రైతుల పంటలు నష్టపోకుండా ఉండాలంటే వాగును వెడల్పు చేయాలని, ఇందుకోసం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులను గుర్తిస్తే ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి పనులను చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు రైతులు సహకరించాలని, పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు ఏదో విధంగా ఆర్థిక సాయం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, మండల నాయకులు పాషా, రఘు, కుమార్, మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి రాజేష్, ఆర్ఐ అనిత తదితరులు పాల్గొన్నారు.



పురుగుల మందు తాగేందుకు ప్రయత్నిస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

నేడు సాట్ 'క్యూ' ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్



సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న వరదారెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం, ఉన్నత విద్య అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రతిభా పరీక్ష సాట్ క్యూ ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్ ఈ నెల 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీలోని ఎస్సార్ ఎడ్యు సెంటర్‌లో శనివారం సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో చేరబోయే 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీ ఎస్సార్ ఎడ్యు సెంటర్ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10వ తరగతి స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సిలబస్‌లో మొత్తం 75 ప్రశ్నలు (ప్రతి సబ్జెక్టుకు 25 చొప్పున) ఉంటాయని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు, 100 శాతం స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశంతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ప్రవేశం పొందే ఎంపీసీ స్ట్రీమ్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ (ఫోకస్ ప్రైమ్/ఫోకస్ ప్లస్/ఫోకస్/స్పార్క్/టైటన్) బైపీసీ స్ట్రీమ్ నీట్, ఎంసెట్ (ఫోకస్ ప్రైమ్/టైటన్) కోర్సులకు అర్హులని తెలిపారు. ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ తన 50 ఏళ్ల విద్యా ప్రావీణ్య సంప్రదాయాన్ని కొనసాగిస్తుందన్నారు. దేశంలోనే ఉత్తమ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సాట్ క్యూ పరీక్షను నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకొని ఉత్తమ స్కాలర్‌షిప్ అవకాశాలను పొందాలన్నారు. విద్యార్థులు పరీక్ష నమోదు కోసం సమీపంలోని ఎస్సార్ బ్రాంచ్‌ను లేదా 9642117378, 9154989356, 8886287456, 9154854700, 9642117330, 9642117830, 9642114698 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చోరీల నిందితుడి అరెస్టు

• రూ.6 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
• వివరాలు వెల్లడించిన కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసి రూ.6 లక్షల విలువ చేసే 40 గ్రాముల బంగారు, 50 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.56,400 నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. శనివారం కేయూ పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేరుల సమావేశంలో నిందితుడి అరెస్టు చూపి వివరాలు వెల్లడించారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి, తేజిగూడకు చెందిన సెండె అరుణ్‌కుమార్ 2022లో వరంగల్‌లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజడ్‌సీ పూర్తి చేసిన తరువాత ఒక సంవత్సరం ఇంటి వద్దే ఖాళీగా ఉంటూ తల్లిదండ్రులతో జీవనం సాగించాడు. 2024లో ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు హనుమకొండకు వచ్చి గది అద్దెకు తీసుకొని చదువుకునేవాడు. ఈ క్రమంలోనే అరుణ్‌కుమార్ బెట్టింగులకు బానిసై చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గోపాల్‌పూర్, భీమారం ఏరియాలలో ఇంటికి తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి పూట తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లేవాడు. నిందితుడు సుమారు 10 నేరాలు చేసినట్లు అంగీకరించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. ఇందులో భాగంగా నిందితుడి వద్ద 10 కేసులలో మొత్తం రూ.6 లక్షల విలువైన 40 గ్రాముల బంగారు, 50 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.56,400 నగదును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన కేయూసీ ఎస్సైలు పి.శ్రీకాంత్, కె.నవీన్‌కుమార్, క్రైం సిబ్బంది అహ్మద్ పాషా, రాజశేఖ ర్, జితేందర్, సీసీఎస్ వరంగల్ సిబ్బంది టి. మధు, బి.చందులను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వేటు

» బతికున్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనలో చర్యలు
» విధులను నిర్లక్ష్యం చేయొద్దు : ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మానుకోట జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెహ్రూసెంటర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు విధులను నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యాధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, అలా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆస్పత్రిలో నర్సులు.. కాలక్షేపం చేస్తూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పనిచేయిస్తున్నారన్న విషయం కూడా తెలిసిందని పేర్కొన్నారు. ఈ విషయంపై మరోసారి ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. ఆదివారం నుంచి ఏ ఒక్క ఉద్యోగి ఆస్పత్రిలో విధుల్లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ ఉపయోగించవద్దన్నారు. అత్యవసరమైతే స్మార్ట్ ఫోన్‌లకు బదులుగా కీప్యాడ్ ఫోన్‌లను ఉపయోగించాలన్నారు. ప్రాణాలతో ఉన్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది సీహెచ్.వెంకన్న (సెక్యూరిటీ గార్డు), రాజన్న (శానిటేషన్ సూపర్‌వైజర్)లను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. కాగా, ఇరువురిని విధుల నుంచి తక్షణమే తొలగించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బత్తుల శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ లకావత్ వెంకట్, జిల్లా ఆస్పత్రి ఆర్ఎంవో బానోత్ జగదీష్ ఉన్నారు.

ఇప్పటికైనా కదిలేనా!?

(5వ పేజీ తరువాయి)

అడ్డు వస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో మరో 321కి పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు సమాచారం. ఈ అక్రమ కట్టడాల వల్ల హంటర్‌రోడ్డులో పలు కాలనీల్లోకి వరద నీరు చేరుతోంది.

అలాగే వరంగల్ దేశాయిపేటలోని చిన్నవడ్డెపల్లి చెరువు 70.74 ఎకరాల్లో విస్తరించి ఉండగా, సుమారు 35 ఎకరాలకు పైగా చెరువు భూమి కబ్జాకు గురైంది. చెరువు శిఖంను అక్రమించుకుని 329 అక్రమ నిర్మాణాలు చేపట్టగా, కేవలం 12 అక్రమ కట్టడాలనే అధికారులు కూల్చివేసి, 110 కట్టడాలకు సంబంధించి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇంకా 211 అక్రమ నిర్మాణాలకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. అలాగే కాజీపేటలోని నిట్ వెనకాల ఉన్న బంధం చెరువు సుమారు 65.20ఎకరాల్లో విస్తరించి ఉంది. దాదాపు ఈ చెరువులో 366 అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లుగా అధికారులు గుర్తించారు. అయితే కేవలం పాతిక అక్రమ కట్టడాలనే కూల్చివేసిన అధికారులు.. మరో 125 అక్రమ కట్టడాలకు నోటీసులు ఇచ్చి మరిచిపోయారనే విమర్శలు ఉన్నాయి. మిగతా 220 అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు లేకపోవటం వెనుక మతలబేమిటనే చర్చ జరుగుతోంది.

అలాగే పైడిపల్లి శివారులో హనుమాన్ జంక్షన్ సమీపంలోని కోటచెరువు 172.40 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఇందులో 70ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్లుగా గుర్తించారు. ఈ చెరువు భూముల్లో 150 అక్రమ కట్టడాలు నిర్మించారు. అధికారులు 4 అక్రమ నిర్మాణాలను తొలిగించి, 50మందికి నోటీసులు ఇవ్వగా, మిగతా 96 అక్రమ నిర్మాణాలపై దాటవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హనుమకొండలోని వడ్డెపల్లి చెరువు 556.32 ఎకరాల్లో విస్తరించి ఉండగా, దీనిలో సుమారు 100 ఎకరాల వరకు భూమి అక్రమణకు గురైనట్లుగా ఆరోపణలున్నాయి. చెరువు కట్టను అక్రమించుకుని ఫంక్షన్ హాల్స్, అపార్ట్‌మెంట్స్ నిర్మించారని ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలున్నాయి. అలాగే గోపాల్‌పూర్ చెరువు నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిల్లో కరిగిపోయిందనే విమర్శలు ఉన్నాయి. అక్రమాలతో గోపాల్‌పూర్ చెరువు నీళ్లు కాలనీలను ముంచెత్తింది. ఉర్సు చెరువు, తిమ్మాపూర్ బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, రంగశాయిపేట చెరువులతో పాటు నగరంలోని, శివారులోని చెరువులు, కుంటల్లో కబ్జారాయుళ్లు తిష్టవేసి చెరువులనే మింగేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మురికిలోనూ కబ్జాలే..

మురికి కాలువలను కూడా కబ్జాకోరులు వదలటం లేదు. నయీంనగర్ నాలాకు ఇరువైపులా భారీగా కబ్జాలు చేశారు. 5.55 కిలోమీటర్లు ప్రయాణించే నయీంనగర్ నాలాకు వడ్డెపల్లి చెరువు నుంచి గోపాలపూర్ ఊర చెరువు వరకు 136 అక్రమ కట్టడాలు నిర్మించారు. వీటిలో అధికారులు కేవలం 36 అక్రమ నిర్మాణాలనే తొలగించగా, మిగతా అక్రమ నిర్మాణాలను తొలిగించటంపై కార్పోరేషన్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో పలువురు కోర్టును ఆశ్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలాగే నయీంనగర్ నాలాలో మరో భాగం రాజాజీనగర్ బ్రిడ్జి నుంచి కాకతీయ కెనాల్ బ్రిడ్జి వరకు 147 అక్రమ కట్టడాలు ఉన్నాయి. వీటిలో 56 అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించగా, 33 నిర్మాణాలపై కోర్టు నుంచి స్టే అర్డర్ తెచ్చుకున్నారు. మిగిలినా అక్రమ నిర్మాణాలను తొలగించటంలో అధికారులకు రాజకీయ అడ్డంకులు ఎదురవుతున్నాయి. అలాగే భద్రకాళి నాలా 3.63కిలో మీటర్లు ప్రవహిస్తోంది. ఇందులో పోతననగర్, అంలకార్ బ్రిడ్జి, అలాగే కాపువాడ, భద్రకాళి మత్తడి, అలంకార్ బ్రిడ్జి వరకు మొత్తం 101 అక్రమ కట్టడాలు ఉన్నట్లుగా గుర్తించారు. అలంకార్ బ్రిడ్జి నుంచి కాకతీయ కెనాల్ వరకు 30 అక్రమ నిర్మాణాలు ఉండగా, 11 నిర్మాణాలను తొలగించారు. మిగతా 19 అక్రమ కట్టడాల వైపు చూసేందుకు అధికారులు జంకుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక హంటర్‌రోడ్డులో బొందివాగు నాలా 0.84కిలో మీటర్లు ప్రవహిస్తోంది. ఇందులో బెస్తం చెరువు నుంచి జక్కలొద్ది వరకు 8 అక్రమ నిర్మాణాలు ఉండగా, నాలుగు కట్టడాలపై కోర్టులో కేసు నడుస్తున్నది. సాకరాశికుంట నాలా 6.40కిలో మీటర్లు నగరంలో ప్రవహిస్తోంది. ఈ నాలాకు ఇరువైపులా 102 అక్రమ కట్టడాలు ఉన్నట్లు గుర్తించినప్పటికీ అక్రమ నిర్మాణాలన్నింటినీ తొలగించేందుకు అధికారులు ముందుకు రాకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

మొత్తం వరంగల్ మహానగరంలో నాలుగు ప్రధాన నాలాలకు ఇరువైపులా 524 అక్రమ కట్టడాలను గుర్తించారు. ములుగురోడ్డు సమీపంలో కొందరు అక్రమార్కులు 40 ఎకరాల భద్రకాళి నాలా భూములను అక్రమించుకుని దర్జాగా వ్యాపార నిర్మాణాలు చేపట్టారు. వేల కోట్ల విలువైన నాలా భూములు కబ్జాకోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. భద్రకాళి నాలా వద్ద ఎల్‌బీ కాలేజీ సమీపంలో 60మంది రజక కులస్తులకు కేటాయించిన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమించుకుని దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టారని, ఆ కులస్థులు పదేళ్లకు పైగా పోరాటం చేస్తున్నారు. నాలాల ద్వారా బయటకు వెళ్లాల్సిన వరద నీరు రోడ్డెక్కుతోంది.

అయితే సీఎం ఆదేశాలను అమలు చేసేందుకు అధికారులు ముందుకు వస్తారా..? వస్తే రాజకీయం అడ్డు తగలకుండా ఉంటుందా అనే చర్చ జరుగుతోంది. గోపాల్‌పూర్ చెరువు అక్రమణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కీలకంగా ఉన్న ప్రజాప్రతినిధులే కాకుండా, ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలు ఉన్నారనే ప్రచారం ఉంది. అలాగే చిన్నవడ్డెపల్లి చెరువుల, బంధం చెరువు, కోటా చెరువు, భద్రకాళి చెరువు శిఖం అక్రమణలో అన్ని పార్టీల్లోని కొందరు కీలక నేతలు, వారి అనుచరగణం ఉంది. రాజకీయ బెదిరింపులను తట్టుకుని అధికారులు కబ్జాలపై కన్నెత్తి చూడగలరా? అనే చర్చ నడుస్తోంది.

అధికారుల్లో కదలిక వచ్చేనా ?

మొంథా తుఫాన్‌కు వరంగల్ జలమయం కావటంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. వరంగల్ నగరానికి ప్రధానంగా ఉన్న గొలుసుకట్టు చెరువుల అక్రమణ, నాలాల కబ్జాలే వరద ముంపునకు కారణంగా గుర్తించారు. దీంతో శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో నాలాల కబ్జాలు, చెరువుల అక్రమణపై ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, పది మంది కోసం వేల మందిని ఇబ్బంది పెట్టడం సరికాదని సీఎం అన్నారు. కబ్జాల్లో ఎంతటి వారు ఉన్న వదలకుండా చర్యలకు దిగాలని ఆదేశాలు జారీ చేశారు.

బైక్ ఢీకొని ఐదు గొర్రెలు మృతి

కేసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం తాళ్ళపూర్యాతండా శివారు మూలస్తంభం సమీపంలో శనివారం రాత్రి బైక్ ఢీకొని ఐదు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మూడు గొర్రెలు గాయపడ్డాయి. మూలస్తంభం తండా వాసులైన భూక్య జామ్లా, ఇస్లావత్ రాజులకు చెందిన గొర్రెల మందను రోడ్డుపై తీసుకెళుతుండగా ఇనుగుర్తి వైపునకు ఒక యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి గొర్రెల మందలోకి దూసుకెళ్లాడు. ఫలితంగా బైక్ నడుపుతున్న యువకుడు తీవ్రంగా గాయపడడంతో పాటు ఐదు గొర్రెలు మృతి చెందాయి.

ప్రధానోపాధ్యాయులకు యూడైస్‌పై శిక్షణ

ఇనుగుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి జడ్పీ హైస్కూల్లో శనివారం యూడైస్ ఆన్‌లైన్ చేసే విధానంపై ఎంఈవో జంగా రూపారాణి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు, సాంఘిక సంక్షేమ పాఠశాలల హెచ్‌ఎంలకు ఒకరోజు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠశాలల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్‌కె.ఖాదర్ స్ర్కీన్‌పై వివరించారు. హెచ్‌ఎంలతో పాటు ఐఈఆర్‌పీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే సమసమాజ స్థాపన

సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఐలయ్య

మహబూబాబాద్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సమ సమాజస్థాపన జరుగుతుందని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 9 వరకు జరిగే అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను శనివారం ప్రారంభించారు. పట్టణంలోని దివంగత రంగ దాసు స్థూపం వద్ద గౌని ఐలయ్య, దివంగత మాధవన్న స్థూపం వద్ద మండల వెంకన్న ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కోసం కొనసాగుతున్న గోదావరిలోయ ప్రతిఘటన పోరాటంలో అనేక మంది విప్లవవీరులు రాజ్యహింస, పోలీస్ నిర్బంధం, బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులయ్యారని చెప్పారు. ఆదివాసీ, గిరిజన, పేద ప్రజల విముక్తి కోసం గత 50 సంవత్సరాలుగా అసమాన త్యాగాలు చేస్తూ, పోడు భూముల పోరాటాలు దోపిడీ, దౌర్జన్యాలకు, పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించి, ప్రజల పక్షాన నిలిచారని తెలిపారు. లక్షలాది ఎకరాలను పేదలకు అందించిన చరిత్ర న్యూ డెమోక్రసీ పార్టీకి ఉందన్నారు. తొలుత అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల ఆధ్వర్యంలో తహసీల్ ఆఫీస్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాలావత్ లింగ్యా, సామ పాపయ్య, బట్టు చైతన్య, మాదారపు రాజు, ఎమ్డీ, కవిత, సామ రజిత, మంద పద్మ, మామిడాల వెంకన్న, కుక్కముడి యాకయ్య, అల్లి యాకాంబ్రం, మునిత, కల్పన, గువ్వ శ్రీను, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో మాట్లాడుతున్న గౌని ఐలయ్య

సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో..

పేద ప్రజల కోసం తమ ప్రాణాలర్పించిన పోరాట వీరులను మరువద్దని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించారు. పట్టణంలోని రంగదాసు స్థూపం వద్ద డివిజన్ కార్యదర్శి పూనెం ప్రభాకర్ ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా హాజరైన కొత్తపల్లి రవి మాట్లాడుతూ దోపిడి, పీడన, అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడి తమ విలువైన ప్రాణాలను అర్పించిన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముంజంపల్లి వీరన్న, తుపాకుల వెంకన్న, బూర్గుల మోష, లింగస్వామి, నందీశ్వర్, ప్రవీణ్, నరేందర్ పాల్గొన్నారు.

● నెల్లికుదురు : పేద ప్రజల కోసం ఆసులుబాసిన అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపెల్లి రవి తెలిపారు. అమరవీరుల వారోత్సవాలలో భాగంగా రావిరాల వద్ద సురేషన్న స్థూపం వద్ద, ఆలేరులో గుడె గణపతి స్థూపాల వద్ద జెండాలు ఎగరవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా పేద ప్రజలపై సాగుతున్న దోపిడీ అంతం చేయడమే అమరవీరులకు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ముంజంపెల్లి వీరన్న, జక్కుల కేశవులు, రవీందర్, లింగస్వామి, యాకయ్య, ఈర్ల వెంకన్న, కావటి రమేష్, పాల్గొన్నారు.

ఇటుక బట్టీ యజమానులకు నోటీసులు

నెహ్రూసెంటర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాల్టా చట్టం నిబంధనలకు లోబడి ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకోవాలని మహబూబాబాద్, డోర్నకల్ రేంజ్ అధికారులు జోత్స్నాదేవి, ప్రతాపనేని రేణుక అన్నారు. మహబూబాబాద్, డోర్నకల్ రేంజ్ పరిధిలో ఉన్న ఇటుక బట్టీ యజమానులకు ఇప్పటికే రెండు సార్లు నోటీసులు అందించినట్లు చెప్పారు. శనివారం మూడో నోటీస్ సైతం అందించడం జరిగిందన్నారు. అటవీచట్టం 1967 ప్రకారం.. ఇటుక బట్టీనందు కర్రలను అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కర్రలను ఉపయోగించకూడదన్నారు. తప్పకుండా పర్మిట్ సాయంతోనే కర్రలను ఉపయోగించి ఇటుక బట్టీల్లో కాల్చాలన్నారు. లేనిపక్షంలో అటవీచట్టం 1967 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కేసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జూబ్లిహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో కేంద్రప్రభుత్వం, బీజేపీ పార్టీపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను ఆ పార్టీ నాయకులు కేసముద్రంలో శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని తమ పార్టీపై వ్యాఖ్యలను వెనుకకు తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార దుర్వినియోగంతో జూబ్లిహిల్స్ ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి గెలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వోలం శ్రీనివాస్, ఉప్పునూతల రమేష్, బోనగిరి ఉపెందర్, లెంకలపల్లి శ్రీనివాస్, బజ్జూరి వీరభద్రాచారి, సింగంశెట్టి మధుకర్, చక్రధర్, పూర్ణకంటి భాస్కర్, నగేష్, సందీప్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు హోమియో వైద్య శిబిరం

నెహ్రూసెంటర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రంలోని మార్వాడీ భవన్‌లో ఈనెల 3న ఆయూష్‌శాఖ ఆధ్వర్యంలో హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు అయూష్ శాఖ మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జి పి.కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్యనిపుణుల బృందం సేవలందించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు తగిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మందులు అందజేస్తారన్నారు. ఇట్టి శిబిరాన్ని మహబూబాబాద్ జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో ప్రారంభిస్తారన్నారు. ఈ శిబిరాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


బురదమయమైన ప్రాంతాన్ని సందర్శిస్తున్న సీపీఎం నేతలు

శివారు కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, వన్‌టౌన్, టూటౌన్ ఏరియా కార్యదర్శులు రావుల రాజు, సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని మొంథా తుపాన్ ప్రభావిత ప్రాంతాలను శనివారం సీపీఎం ప్రతినిధి బృందం సందర్శించింది. అక్కడ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు శివారు కాలనీలు జలమయమై రోడ్లు కొట్టుకుపోయి బురదనీటిలో ప్రజలు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. వరద నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు అందించాలన్నారు. శివారు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించి ప్రజల కష్టాలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

విద్యతోనే సమాజంలో సముచిత స్థానం

● నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ



పూర్వవిద్యార్థులను సన్మానిస్తున్న సత్యనారాయణ, డైరెక్టర్ సాధన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం, సముచిత స్థానం ఉంటుందని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని అర్తిగార్డెన్స్‌లో శనివారం నలంద డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైనదని, లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళికా యుతంగా క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. చదువు సంస్కారం నేర్పాలే కానీ సమస్యలు సృష్టించకూడదని చెప్పారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాలలో విద్యనభ్యసించి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన ఐదుగురు పూర్వవిద్యార్థులు లోకేష్, రవి, వినోద్, బిందు, ప్రత్యూష, వివిధ యూనివర్సిటీల్లో పీజీ సీట్లు సాధించిన విద్యార్థులకు శాలువాలు కప్పి మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డోలి సాధన, తెలంగాణ ఉద్యమకారుడు చాగంటి కిషన్, ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సమ్మిగౌడ్, గాయకుడు మల్లేష్, బుర్ర గోవర్దన్, రమేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమానికి చట్టం చేయాలి'

కేసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం కేంద్రం సమగ్ర చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గొడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. మండలంలోని అన్నారంలో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు రోజుకు రూ.800 వేతనం, 57ఏళ్లు నిండిన వారికి రూ.5వేల పింఛను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గుగులోత్ ధర్మ, బాను, కౌసల్య, సీత, విజయ, పద్మ, దేవి, లాల్‌సింగ్, భద్రు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ఇనుగుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోమటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి మాజీ సర్పంచ్ నీలం యాకయ్య శనివారం శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.5లక్షల నిధులు మంజూరు చేశారని యాకయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ధీకొండ వెంకన్న, కూరెల్లి సతీష్, గడ్డం యాకమూర్తి, చిర్రగోని యాకమూర్తి, పూజరి కొమురయ్య, నీలం వెంకన్న, రావుల మల్లేషం, గడ్డం ఐలయ్య పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : ఎంసీపీఐ (యూ)



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కుమారస్వామి

కేసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపానుతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి డిమాండ్ చేశారు. కేసముద్రంలో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను ప్రభావంతో చేతికంది వచ్చే వరి, మిర్చి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిని, లక్షల రూపాయల పెట్టుబడి రైతులు నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 19న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కంచె వెంకన్న, బొల్లోజు రాంమోహనాచారి, నూకల ఉపెందర్, కటకం బుచ్చిరామయ్య పాల్గొన్నారు.

15న ప్రత్యేక లోక్ అదాలత్

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఫీ


మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న రఫీ

మహబూబాబాద్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈనెల 15న మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ రఫీ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో తొర్రూరు, మానుకోట కోర్టుల పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా మానుకోట జిల్లా కోర్టు, తొర్రూరు కోర్టుల్లో నిర్వహించబడుతున్న ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యంగా తక్షణమే పరిష్కరించుకోవచ్చన్నారు. సివిల్ కేసులు, వివాహ సంబంధిత కేసులు, మోటారు ప్రమాద క్లెయిమ్‌లు, చెక్ బౌన్స్ కేసులు, ఇతర రాజీ పడదగిన క్రిమినల్ కేసుల్లో సత్వర న్యాయం కోసం ప్రత్యేక లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శాలినీ షాకెల్లి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరవపల్లి కృష్ణతేజ్, మానుకోట సబ్ డివిజనల్ పోలీస్ అధికారి తిరుపతిరావు, పీపీ గణేష్ ఆనంద్, జిల్లా కోర్టు ఏవో క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం


కల్వర్టు నిర్మాణానికి మార్క్‌వుట్ చేస్తున్న అర్‌అండ్‌బీ శాఖ ఇంజనీర్లు

డోర్నకల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై మైనార్టీ గురుకుల పాఠశాల వద్ద నూతన కల్వర్టు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. శనివారం మహబూబాబాద్ ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ సంపత్‌లు కల్వర్టు నిర్మాణానికి మార్క్‌వుట్ చేశారు. డోర్నకల్‌లో ఓ మోస్తారు వర్షం కురిసిన నీరు మైనార్టీ పాఠశాలలోకి వెళ్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పాఠశాలలోకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థినులను తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థినుల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌లు అక్కడ వరద నీరు పోయేందుకు వీలుగా కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆర్‌అండ్‌బీ శాఖను ఆదేశించారు. దీంతో కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.

డోర్నకల్ తహసీల్దార్‌గా రాఘవరెడ్డి

డోర్నకల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నూతన తహసీల్దార్‌గా వేమిరెడ్డి రాఘవరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి బదిలీపై డోర్నకల్ తహసీల్దార్‌గా వచ్చారు. గతంలో డోర్నకల్ తహసీల్దార్‌గా పనిచేసిన ఇమ్మాన్యుయేల్ శుక్రవారం పదవీవిరమణ చేశారు. ఆయన స్థానంలో రాఘవరెడ్డి నూతన తహసీల్దార్‌గా నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాఘవరెడ్డిని రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

నష్టాన్ని అంచనా వేయాలి : కలెక్టర్

మహబూబాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ వల్ల వచ్చిన వానలు, వరదలతో కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణ పథకం అమలు పురోగతిపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి మేనేజ్‌మెంట్ ప్లాన్ (ప్రణాళిక) వ్యవసాయ, విద్యుత్, పశు సంవర్థక, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ విభాగం, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ తదితర విభాగాల శాశ్వత, మండలస్థాయి ప్రణాళికలు సిద్ధం చేసి రాష్ట్రానికి పంపించే నివేదికలను వెంటనే జిల్లాకు పంపించాలని సూచించారు. పేదల సొంతింటి నిర్మాణం కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మంజూరైన ఇళ్ల సర్వే వివరాలను వందశాతం పూర్తిచేసి అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్ల నిర్మాణం సొంతింటి కలసాకారం చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, జడ్పీ సీఈవో పురుషోత్తం, హౌసింగ్ పీడీ హనుమనాయక్ పాల్గొన్నారు.

జాతరకు సౌకర్యాలు కల్పించాలి

కురవి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమి సందర్భంగా కురవి మండలం కందికొండలో ఈనెల 5న జరిగే శ్రీలక్ష్మీనర్సింహాస్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం అన్నారు. కురవి మండలం కందికొండలో శనివారం జాతర ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఎంపీడీవో గౌస్‌పాషా, ఎస్సై సంతోష్, ఏఈ శ్రీనివాస్‌లతో కలిసి రహదారులను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యంతో పాటు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. నిరంతరంగా విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. పారిశుధ్య కార్మికులను అందుబాటులో ఉంచాలన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జట్టు ఎంపిక

డోర్నకల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును శనివారం డోర్నకల్ జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన పోటీల ద్వారా ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు మహబూబాబాద్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలోజు సుధాకర్, కార్యదర్శి కొత్త రాంబాబులు తెలిపారు. బాలికల 44 కేజీల కేటగిరిలో బి.భువనేశ్వరి, 48 కేజీల కేటగిరిలో ఎ.వరలక్ష్మి, 53 కేజీల విభాగంలో టి.ఇంద్రజ, 58 కేజీలలో బి.జ్ఞానేశ్వరి, 63 కేజీల విభాగంలో జి.నందిని, 69 కేజీల విభాగంలో జి.హరిక, 77 కేజీల విభాగంలో వి.కీర్తనలు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో 56 కేజీల్లో అభిలాష్, 60 కేజీల్లో ఎల్.వీరేష్, 65 కేజీల విభాగంలో ఎస్.శరత్, 71 కేజీల విభాగంలో ఎ.సింధూనాయక్, 79 కేజీల విభాగంలో ఎన్.గోపిశశికాంత్, 98 కేజీల విభాగం నుంచి ఎం.లెనిన్ ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన వారు ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు స్థానిక జడ్పీ హైస్కూల్లో జరుగనున్నట్లు వారు తెలిపారు. జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బండి నర్సింహారావు, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

డబ్ల్యూజీఎల్-44 వరిని దీర్ఘకాలిక పంటగా సాగు చేసుకోవచ్చు

● కేవీకే సమన్వయకర్త దిలీప్‌కుమార్

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డబ్ల్యూజీఎల్-44 వరి రకాన్ని రెండేళ్ల నుంచి మూడేళ్ల వరకు దీర్ఘకాలిక పంటగా సాగు చేసుకోచ్చునని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ దిలీప్‌కుమార్ రైతులకు సూచించారు. మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం శనివారం మహబూబాబాద్, కురవి మండలాల్లో పర్యటించి నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం, క్షేత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాకుండా వరి, పత్తి, మిర్చి పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. డబ్ల్యూజీఎల్-44 వరి విత్తనాలను గతేడాది రైతులకు అందించడం జరిగిందని చెప్పారు. ఈ రకం వరి విత్తనాలు ఈ ఏడాది కూడా మరికొంతమంది రైతులకు అందించడం జరుగుతుందన్నారు. తుపాన్ మూలంగా దెబ్బతిన్న పత్తి, మిర్చి, కంది, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బి.క్రాంతికుమార్, ఎల్.సుహాసిని, కురవి మండల వ్యవసాయ శాఖాధికారి నర్సింహారావు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

'బాలికలు విద్యావంతులైతే దేశానికి మంచి భవిష్యత్'


సైకిళ్లను పంపిణీ చేస్తున్న నాయ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి దివ్య

కురవి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాలికలు విద్యావంతులైతేనే దేశానికి మంచి భవిష్యత్ ఉంటుందని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (నాయ్) ప్రాజెక్టు డైరెక్టర్ దివ్యకర్లె అన్నారు. కురవి జడ్పీఎస్ఎస్‌లో శనివారం విద్యార్థినులకు నాయ్ ఆధ్వర్యంలో జీఆర్ఇన్ ప్రాసోషల్ వెల్ఫేర్‌లో భాగంగా 14 సైకిళ్లు, వాటర్ ప్యూరీఫైడ్ సిస్టం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలే దేశానికి మూలస్తంభాలని, ఆడపిల్లలు చదువుకుంటేనే సమాజం ఉన్నత స్థానంలో ఉంటుందన్నారు. నిరుపేద బాలికలకు తమ సంస్థ నుంచి ఎటువంటి సహాయం కావాలన్నా అందిస్తామన్నారు. రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై సతీష్, హెచ్ఎం వహీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఏ రైతుకూ అన్యాయం జరగవద్దు'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా వర్షాలతో నష్టపోయిన పంటలను అంచనా వేయాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సూచించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వ్యవసాయ శాఖాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్షాలతో నష్టపోయిన పంటల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుపాన్ నేపథ్యంతో మహబూబాబాద్ నియోజకవర్గంలో అధికంగా వర్షపాతం నమోదు కావడంతో పంటలు బాగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లి పంటనష్టం వివరాలను సేకరించాలని చెప్పారు. నష్ట పోయిన ప్రతీ రైతుకు పరిహారం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మల, ఏవోలు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.